క్లుప్తంగా

దిశ యాప్‌తో రక్షణ



యాప్ డౌన్‌లోడ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ, ఎంపీడీఓ

కౌతాళం: దిశ యాప్ రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. దిశ యాప్‌పై మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కలిప్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. బుధవారం స్థానిక ఈరన్నకట్ట వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్స్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ తమ సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కానిస్టేబుల్ నరేంద్ర, వీరభాస్కర్, మోహన్‌రాజ్, ఉమా మహేశ్వర్‌బాబు, మహిళ పోలీసులు సుమతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాగరాజు

ఆదోనిసెంట్రల్: 2018–19లో వచ్చిన సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగరాజు, సీనియర్ నాయకుడు పి.ఈరన్నగౌడ్ కోరారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం యూనియన్ ఆదోని డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2022 పీఆర్సీ, అదే ఏడాది జనవరి, జూలై డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకుడు మహాదేవప్ప, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బి.ఈరచంద్ర యాదవ్, ఆదోని మండల అధ్యక్షుడు యం.సి.సుంకన్న, రామాంజనేయులు, రామ్మోహన్‌రెడ్డి, అంజినయ్య పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

కౌతాళం: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నివాసముంటున్న గుజ్జుల ఈరన్న (40)బుధవారం మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో తక్షణ సాయం కింద మృతుడి నామిని అయిన భార్య ఈరమ్మకు సర్పంచ్ పాల్‌దినకరన్ రూ.10వేలు అందజేశారు. కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు వీరేష్, రాముడు, వార్డు మెంబర్ రామకృష్ణ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో విద్యార్థిని ప్రతిభ



భార్గవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భార్గవి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపింది. ఎమ్మిగనూరులో ఈ నెల 4,5,6వ తేదీల్లో 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. కర్నూలు జిల్లా జట్టు తరఫున భార్గవి పాల్గొని ప్రతిభ చూపింది. మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని డీఈఓ రంగారెడ్డి అందజేశారు. బుధవారం ఈమేరకు విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించండి

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కాంట్రాక్టర్ బసిరెడ్డికి సూచించారు. బుధవారం జంపాపురం గ్రామంలో రూ.17.40 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడప కు మన ప్రభుత్వం కింద ప్రతి సచివాలయానికి రూ.40లక్షలు మంజూరయ్యాయని, వాటితో సచివాలయం పరిధిలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి వసతి, వీధిలైట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆరోన్, ఉప సర్పంచ్ శివశంకర్ రెడ్డి ఉన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి

కౌతాళం: పిల్లలందరినీ పాఠశాలలకు పంపేలా చూడాలని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్టళ్లను పరిశీలించి అక్కడ విద్యార్థుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి వివరించాలని ఎంపీడీఓ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచే విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా చూడాలని చెప్పారు. వందశాతం అక్షరాస్యతకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని అందుకే ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ జుబేర్‌అహ్మద్ ఉన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమం అమోఘం



లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు అమోఘంగా సాగుతోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోసిగి సచివాలయం–4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు తీరును, పథకాల లబ్ధి వివరాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు తలదించుకునేలా పాలన సాగించడంలో జగనన్న విజయవంతమయ్యారని కొనియాడారు. గాంధీజీ కలలు కన్న గ్రామీణ స్వరాజ్యం ఇప్పుడే సాధ్యపడిందన్నారు. ఊరూరా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు ఇంటి వద్దకే పథకాలు అందజేశారని చెప్పారు. గతంలో మాదిరి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి దుస్థితి లేదన్నారు. కాలనీలో విద్యుత్ సమస్యలు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల బిల్లుల మంజూరులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, సర్పంచ్ అయ్యమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు, ట్రాన్స్ కో ఏఈ వీరేష్, ఎస్ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మహిళ సంక్షేమానికి పెద్ద పీట



స్త్రీనిధి చెక్కును పొదుపు మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవన కార్యాలయంలో స్త్రీ నిధి జిల్లా ఏజీఎం దయాసాగర్, ఏపీఎం సత్యమ్మ ఆధ్వర్యంలో స్త్రీనిధి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదుగేందుకు జగనన్న సంక్షేమ పథకాలు వారి పేరుతోనే అందజేస్తున్నారని చెప్పారు. ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు కూడా వారి పేరుతోనే ఇస్తున్నారన్నారు. తక్కువ వడ్డీకే స్త్రీ నిధి రుణాలు అందిస్తున్నారన్నారు. జిల్లాలోనే రూ.180 కోట్లు స్త్రీ నిధి కింద పొదుపు మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందించినట్లు ఏజీఎం దయాసాగర్ తెలిపారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానిక గానూ కోసిగి మండలానికి రూ.4.58 కోట్ల రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని 13 గ్రామైక్య సంఘాలలో 400 మంది పొదుపు మహిళలకు మొదటి విడతగా రూ.2.60లక్షల మంజూరు కాగా పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు.

ప్రజారోగ్యం అందరి బాధ్యత



కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మురుగు కాలువలపై అక్రమంగా కట్టడాలను నిర్మించుకోవడం వల్ల మురుగునీరు ముందుకెళ్లకుండా కట్టడాలు అడ్డుపడుతున్నాయని దీంతో పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యాన్ని రక్షించడం అధికారులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇందుకు శానిటేషన్ కార్మికులపై నిందలు వేయడం సరికాదని, అందరూ బాధ్యతలు గుర్తెరగాలని సూచించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద మున్సిపాలిటీలో పనిచేస్తున్న 187 మంది శానిటరీ కార్మికులకు రెండు జతల యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్మికులకు ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ బోయ శాంత దుస్తులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ ఆదోని కన్నా చిన్నది అయినప్పటికీ అక్కడ వర్కర్లు ఎక్కువగా ఉన్నారని, రాయలసీమలోనే అతిపెద్దదైన ఆదోని మున్సిపాలిటీలో తక్కువ వర్కర్లు ఉన్నారని చెప్పారు. దీంతో శానిటేషన్ వందశాతం మెరుగుపరచడానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆదోనిలో వర్కర్లను పెంచాలని ప్రభుత్వానికి నివేదికను పంపుతామని చెప్పారు. తెలంగాణలోని సూర్యపేట మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకొని పని చేయాలని సూచించారు. అక్కడ ఎక్కడా పందులు కనిపించవని, వీధులు, సందులు, ప్రధాన రోడ్లలో అపరిశుభ్రత ఉండదని, ఆదోనిని కూడా అలా తీర్చిద్దేందుకు ప్రజలు, మున్సిపల్ అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, మంజునాథ్, శ్రీనివాసులు, రవి, కౌన్సిలర్లు, వర్కర్ల సంఘం యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తనయుడు, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 13, 14వ వార్డుల పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవాతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని మనోజ్‌కుమార్‌రెడ్డి భరోసా నిస్తూ ముందుకు సాగారు. నవరత్నాల్లో భాగంగా అందజేస్తున్న పథకాలన్నీ ప్రతి ఇంటికీ అందజేసిన ఘనత జగనన్నదేనని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు సన్ని, శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, కౌన్సిలర్లు సికిందర్, రహీం పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడు, పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్

ఆదోనిరూరల్: పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న బోయ మాధవరం నరసింహుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య బుధవారంతెలిపారు. మద్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు తమ సిబ్బంది ప్రదీప్, వెంకటేష్‌నాయక్‌తో కలిసి కోసిగి క్రాస్ రోడ్డు వద్ద మోటార్‌సైకిల్‌పై తరలిస్తున్న నరసింహుడిని అదుపులోకి తీసుకొని 960 ఒరిజినల్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (10బాక్సులు), మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కేవీబీఆర్ నగర్‌లో బుధవారం దాడులు చేయగా బోయ మునిస్వామి ఇంటి వెనక ముళ్ల పొదల్లో 10 కర్ణాటక మద్యం బాక్సులు లభ్యమయ్యాయని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మొత్తం 90 ఎం.ఎల్. పరిమాణం గల 960 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



మోడల్ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

మంత్రాలయం/కోసిగి : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రాలయం,కోసిగి మండలాల్లో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైందని చెప్పారు. వానే మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. విభజన హామిలను నెరవేర్చడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. నాయకులు వీరేష్, హరి, హనుమంతు, మఠ్రి స్వామి భాష, విజయ్, అశోక్ పాల్గొన్నారు.

ఆదోనిసెంట్రల్: విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. అనంతరం స్థానిక భీమాస్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ గిరిమల్లప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీను, పీడీఎస్ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థి, యువజన ప్రాణ త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. నాయకులు రమేష్, లింగప్ప,ఖాదర్, వీర, గౌస్, శశి, కిరణ్, శివ, సాయి, లక్ష్మిరెడ్డి, మల్లి, రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌతాళం: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, వైఎస్సార్ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం చేపట్టినన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బంద్ చేయించి నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, మండల అధ్యక్షుడు బసవరాజు, కార్యదర్శి సాయివర్మ, నాయకులు మేఘనాథ్, కిషోర్, చౌదరిబసవ, గంగారం, మంజు, షబ్బీర్‌బాషా పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ అల్లీపీరా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏపీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో వలసలు నివారించేలా అధికారులు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉన్న ఊర్లో పనులు కల్పిస్తామని, వలస వెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు. మండలంలో 1204 మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చారని ఈ సంఖ్య పెంచాలని ఆదేశించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. వలసలు వెళ్లే వారు తమ పిల్లలను బడి మాన్పించి తమతో పాటు తీసుకెళ్తున్నారని దీంతో వారి చదువులు మధ్యలోనే ఆగిపోతాయని తల్లిదండ్రులు గుర్తించుకోవాలన్నారు. ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ విజయమోహన్, టీఏ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక వాసి దుర్మరణం

దేవనకొండ: పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన వ్యక్తి ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో మృత్యుఒడికి చేరాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా కె.బెళగల్‌కు చెందిన సురేష్, జిల్లాలోని హొళగుంద మండలం నాగరకన్వికి చెందిన హరిజన రంగనాథ్, హనుమంతు నాగరకన్వి నుంచి కోడుమూరు దగ్గరలోని గాలిమరల పనులు చేసేందుకు బైకుపై బయలుదేరారు. కర్నూలు నుంచి పత్తికొండ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఈదులదేవరబండ వద్ద వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో సురేష్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. రంగనాథ్, హనుమంతుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారిని 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సురేష్‌కు భార్య అఖిల, ఇద్దరు పిల్లలు ఉన్నారు

నిబంధనలు పాటించండి..వెలుగులు నింపండి

- దీపావళి వేడుకల్లో నిబంధనలు పాటించాలి
- బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి
- పెద్దల సమక్షంలో పిల్లలు క్రాకర్స్ కాల్చాలి
- మున్సిపల్ క్రీడా మైదానంలో పది బాణసంచా దుకాణాలకు అనుమతి

ఆదోనిఅర్బన్: మనందరికీ ఇష్టమైన దీపావళి పండగ మరో మూడు రోజుల్లో జరుపుకోనున్నాం. చిన్నా, పెద్దా తేడా లేకుండా సంతోషంగా బాణసంచా కాల్చుతూ పండగ జరుపుకుంటారు. ఈ సమయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా తీవ్ర నష్టం తప్పదు. ఈనెల 13వ తేదీన దీపావళి పండగ. ఈ నేపథ్యంలో పండగపూట తీసుకోవలసిన జాగ్రత్తలు, బాణసంచా విక్రయించే షాపులు, అనుమతులపై ఆదోని సబ్‌కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. అంతేగాకుండా దుకాణదారులకు, ప్రజలకు ఫైర్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

పట్టణంలో పది షాపులు..

పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో బాణసంచా విక్రయించడానికి పది దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు అధికారులు వాటికి విక్రయాలకు అనుమతిచ్చారు. 15వ తేదీ మధ్యాహ్నం లోపు స్టాళ్లను తొలగించాలని యజమానులకు ఆదోని సబ్‌కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదం సంభవిస్తే సమాచారమివ్వండి

దీపావళి సమయంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమతులు ఉన్న వారు మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించాలి. ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు చోటు చేసుకుంటే తక్షణం అగ్నిమాపక కేంద్రానికి లేదా 101కు సమాచారం అందజేయాలి. నిబంధనలు పాటించకపోతే బాణసంచా దుకాణదారులపై చర్యలు తప్పవు.

– రామాంజనేయులు, ఫైర్ అధికారి, ఆదోని ఇన్‌చార్జ్

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కౌతాళం: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భీమన్నను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ రంగారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని బాలికలు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఆర్ యాప్‌లో ఫిర్యాదు రావడంతో విచారణ అనంతరం భీమన్నను సస్పెండ్ చేశారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన విషయం వాస్తవమేనని ఎంఈఓ శోభరాణి, పాఠశాల హెచ్‌ఎం ఇమ్మానియేల్ తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఆదోనిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఈనెల 10వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డీఎం మహ్మద్‌రఫీక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ఇబ్బందులు, ఏయే రూట్లలో బస్సులు నడపాలి, సంస్థ అభివృద్ధికి సలహాలు, సూచనలను సెల్ 9999592225797 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. అలాగే సమస్యలను కూడా తెలియజేయవచ్చని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఆదోనిరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఈనెల 11వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ జగన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బండిమెట్ట, ఎంఎంకాలనీలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని చెప్పారు. మాదిగ సోదరులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు మన్మోహన్, సుధాకర్, నరసింహ, రాజు, యేసు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అరికెర సమీపంలో లభ్యమైన మృతదేహం

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామ సమీపంలోని ఎల్లార్తి రోడ్డులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. ఎల్లార్తి రోడ్డు నందు మహబూబ్ బాషా పొలంలోని డీపీ నంబర్ ఎస్ఎస్ 78 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తు తెలియని శవం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని అరికెర గ్రామస్తులను విచారించగా గత కొన్ని రోజుల నుంచి సదరు వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ షాక్‌కు గురై మరణించాడా, ఇతర కారణాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

రైల్వే, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న ఎం.డి.అంజిబాబు

ఆదోనిరూరల్: రైల్వే, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ అనుబంధ రాష్ట్ర స్థానిక యూనియన్‌ల అధ్యక్ష కార్యదర్శుల సమావేశాన్ని స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, విద్యుత్‌శాఖలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఇప్పటికే కొన్ని రైల్వే లైన్‌లను కొందరు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని దీంతో కార్మికవర్గానికి , ప్రజలకు తీవ్ర నష్టం వాటిళ్లతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌ను కార్పొరేట్ వర్గాలకు అప్పగించడంతో ప్రజలపై విపరీతంగా భారం పడే అవకాశముందన్నారు. ప్రజలందరూ ఏకమై ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. నాయకులు వీరన్న, మహానందరెడ్డి, లక్ష్మన్న, క్రిష్ణమూర్తి, నీలకంఠ, గోవిందు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి

కోసిగి: ఈనెల 15వ తేదీన విజయవాడలో జరగనున్న సీపీఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలపై పెను భారాలు మోపుతోందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. సీపీఎం మండల నాయకుడు రాముడు, వీరేష్, నరసింహులు, రాము, చిన్నన్న, వీరారెడ్డి, ఈరెడ్డి పాల్గొన్నారు.

కౌతాళం: ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజారక్షణభేరి మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వద్ద విడుదల చేశారు. వెంకటేష్, రామలింగ, వీరేష్, వెంకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : తన సొంత నర్సింగ్‌హోంకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం గర్భిణులు, బాలింతలను తీసుకెళ్లనందుకు చేయని నేరాన్ని తనపై వేసి 5నెలలుగా విధులకు దూరంగా ఉంచి, జీతం చేయని డాక్టర్ శాంతిజ్యోతిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆశా వర్కర్ జానకమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెల 27న క్లస్టర్ పరిధిలోనున్న ఐదుగురు గర్భిణులను స్కానింగ్, ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న డాక్టర్ శాంతిజ్యోతి ఫోన్ చేసి ఎవరిని అడిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లావని దుర్భాషలాడిందన్నారు. వారిని తన నర్సింగ్‌హోంకు తీసుకురావాలని తెలియదా అంటూ మందలించిందని వాపోయింది. అలాగే గర్భిణులను కోడుమూరుకు తీసుకెళ్లి లింగనిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నామని నిందలు వేసి విధులకు దూరమయ్యేలా చేసిందని, ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని వేడుకుంది. కాగా.. ఈ విషయంపై డాక్టర్ వివరణ కోరగా.. ఈమెపై పలువురు బాలింతలు, గర్భిణులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, అలాగే ఇప్పటికే పలుమార్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా తాము విచారించి చర్యలు తీసుకునేంత వరకు విధులకు దూరంగా ఉంచాలని చెప్పారని చెప్పారు. తాను ఐదేళ్ల క్రితం నర్సింగ్ హోం ఏర్పాటు చేశానని, ఇన్నేళ్లుగా రాని సమస్య ఇప్పుడెందుకు ఉత్పన్నమైందని ప్రశ్నించారు. కేవలం ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు వేస్తున్న ఎత్తుగడగా అభివర్ణించారు. విచారణ ప్రారంభకాకముందే విధుల్లోకి తీసుకోవాలని తనపై రాజకీయంగా ఒత్తిడి తెస్తున్న విషయాన్ని కూడా ఉన్నతాధికారులకు తెలియజేశానన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



హొళగుంద బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: స్థానిక బీసీ కాలనీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. నాయకులు ఈశా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, నాయకులు కెంచప్ప, హనుమప్ప, సిద్దయ్య, శేక్షావలి తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. చాలాకాలంగా సీసీ రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందించి ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు విడుదల చేసిన నిధులు రూ.20 లక్షలతో రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నుంచి పనులు మొదలు పెట్టి పూర్తి చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో మొత్తం 16 గ్రామ సచివాలయాలుండగా ఇటీవలే అదనపు నిధులు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల ప్రకారంగా మొత్తం రూ.6.40 కోట్లు విడుదలైనట్లు నాయకులు ఈశా తెలిపారు. ఆ నిధులతో స్థానికంగా సీసీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.